# ప్రమీలోపాఖ్యానం ::

రచన :
మిత్రశ్రీ

సూర్యుడు తుంగభద్ర రిజర్వాయర్‌లో మునిగిపోతున్నాడు. తుంగభద్రడాంకు ఉత్తరంగా మునీరాబాద్ వైపు, హైద్రాబాదు ప్రభుత్వం కట్టించిన సమ్మర్ హౌస్‌ను "ఇంద్రభవనం" అంటారు, చూపరులకది నిజంగా ఇంద్రభవనమే. ఎత్తయిన కొండమీద ప్రశాంత వాతావరణంలో ఆధునిక పద్ధతులపై నిర్మింపబడిన ఆ ఇంద్రభవనం రెండు అంతస్థులో మెత్తటి పరుపులుగల 'స్ప్రింగ్‌కాట్' మీద వయ్యారంగా పడుకుని 'జ్యోతి' మాస పత్రిక చదువుతున్న ప్రమీల పత్రికను ప్రక్కనున్న స్టూలుమీదకు పడేసి బద్ధకంగా ఒకసారి ఒళ్లు విరుచుకుని లేచి కూర్చుంది. రిజర్వాయర్‌లో మునిగిపోతున్న ఎర్రని సూర్యుని బంగారు కిరణాలు ఆమె ముఖంమీద ప్రసరించటంలో అందమైన ప్రమీల ముఖం మరింతశోభాయమానంగా వుంది. రేగిన ముంగురుల్ని, తొలగిపోయిన పమిటను సర్దుకుని ప్రమీల బాత్‌రూమ్‌కు దారితీసింది.

స్నానం ముగించుకుని డ్రస్సింగ్ రూంలో నిలువుటద్దంముందు నిల్చుని టాయ్‌లెట్ చేసుకుంటోంది ప్రమీల. తలదువ్వుకోవటంలో అప్రయత్నంగానే పమిట క్రిందికి జారిపోయింది. ప్రమీల అద్దంలో తన సౌందర్యాన్ని చూసుకొని ముగ్ధురాలవుతోంది. ఆ విధంగా ఎంతసేపు గడిపిందో ఆమెకే తెలియదు. తలుపు చాటున నిలబడి ఎవరో తన అర్ధనగ్న సౌందర్యాన్ని వీక్షిస్తున్నట్లు తెలుసుకోగానే పమిట తొందరగా సర్దుకుని చరచరా తలుపుదగ్గర కొచ్చింది. వాకిలి బయట నిలబడివున్న పురుష విగ్రహాన్ని చూసిన తరువాత ఆమె ముఖం సిగ్గుతో ఎర్రబారింది. యూనిఫారంలోవున్న సబ్‌ఇన్‌స్పెక్టర్ రాజు కొద్దిగా వెనక్కి జరిగేడు,

"క్షమించండీ! వాసుదేవరావుగారి కోసంవచ్చేను"

ప్రమీల మెల్లగా బయట వరండాలో కొచ్చింది. "అయితే మీరేనా రాజారావుగారు"

"అవునండి, వాసులేడా?"

"లేరు. రండి! ఆసోఫాలో కూర్చోండి" ప్రమీల రాజుకు సోఫాచూపి ఎదురుగావున్న సోఫాలో తను కూర్చుంది. రాజు కొంచెం తటపటాయిస్తూ అంతవరకు చంకలో పెట్టుకున్న టోపీని సోఫాలోపెట్టి కూర్చున్నాడు. "మీకోసమే వారు మధ్యాహ్నం బళ్లారి వెళ్లేరు." "అలాగా! చాలా పొరబాటే జరిగింది. నేనింకా బళ్ళారిలోనేవున్నాడనుకున్నాడు కాబోలు. వాసువ్రాసిన ఉత్తరం బళ్ళారినుంచి నాకు రీడైరెక్టయి వచ్చింది ఈ రోజే. వెంటనే వచ్చేను."

"అయితే మీరు బళ్ళారిలో వుండటంలేదా?",

"లేదండి. ఇక్కడికి 8 మైళ్ళలో ఒక స్టేషనుంది. అక్కడ వుంటున్నాను. సరే! వస్తే చెప్పండి. రేపు ఉదయం వస్తాను." "మరికాస్సేపట్లో వారు రానే వస్తారు, వుండండి. ఈ రాత్రికి ముగ్గురికి భోజనం చెయ్యమని వాచ్‌మన్‌కు వారు చెప్పి వెళ్లేరు."


## సర్వసిద్ధి యంత్ర

## అపూర్వ శక్తివంత మైనది

దురదృష్ట వశాత్తు ఆర్థిక వ్యవహారాలు, ప్రేమ, ఉద్యోగం, సంపద, లాటరీ, వివాహమూ, వ్యాపారము మున్నగు వాటిలో మీరు ఆశాభంగము పొందిన, శత్రువులు, దుష్టగ్రహాలు, దురదృష్ట, ఉద్యోగాది ప్రయత్నాలలో వ్యతిరేక పరిస్థితుల నెదుర్కొంటున్నా శుభగ్రహకూట సంచలన సమయములో తయారు చెయ్యబడి, ఆధ్యాత్మిక శక్తి సంపన్నమైన మా సర్వసిద్ధి యంత్రమును వాడి చూడండి. తక్షణమే దాని అపూర్వ శక్తులను మీరు గ్రహించగలరు. వెల రు. 5-8-0 ప్రత్యేకమైనది రు. 24-8-0. పోస్టేజీ అదనపు ఫలిత మీయనిచో వెల వాపస్.

**Prof; R. S. JYOTISHI (Astro Philo)**
**(55) P. O. Raj dhanwar (H. Bagh)**

"అరెరే! చాలా శ్రమ కల్గించేను. వాడుంటే చాలా బాగుండేది........"

"కొద్ది సేపట్లో వచ్చేస్తారుగా"

"ఆల్‌రైట్!"

రాజులేచి క్రిందికి దిగి వెళ్లేడు. క్రింద గదిలో పెట్టిన రైల్‌బాగ్‌నుంచి బట్టలు తీసుకొని తన పులివేషం మార్చుకున్నాడు. గదిబయటకు వచ్చేసరికి ప్రమీల హాజరుగా వుంది.

"రండి! అలా బయట తిరుగుదాం" అంటూ జవాబు కోసం ఎదురు చూడకుండానే బయటకు దారితీసింది. రాజుకు వచ్చినప్పటినుంచీ ముళ్లమీద వున్నట్లే వుంది.

* * *

రాత్రి 9 గం॥లవుతోంది. వాసురాలేదు. ఆరు బయట కుర్చీలలో కూర్చొని మను చరిత్రమీద తర్జన భర్జనలు చేస్తున్న ప్రమీల, రాజులకు వాచ్‌మన్ పిలుపు అంతరాయం కల్గింది. ప్రమీల వాచ్ చూసింది. "అబ్బా! తొమ్మిదయింది"

"ఇక వాసు వచ్చే చూచనలేవీలేవు" "సరే! మనం భోజనం చేద్దాంరండి" ప్రమీల మేడమీదకు దారితీసింది. రాజు అనుసరించేడు. ఇద్దరూ బాత్‌రూంకు చేరుకున్నారు. పమీల రాజుకు చెంబులో నీళ్ళిచ్చింది. రాజు చెంబు తీసుకోవటంలో ప్రమీలచేయి తగిలింది. ఇద్దరి శరీరాల్లోకి విద్యుల్లత ప్రాకింది. ప్రమీల సిగ్గుతో తలవంచుకుంది.

భోజనాలు పూర్తయ్యేయి. వాచ్‌మన్ శుభ్రంచేసి సామానులు తీసుకుని వెళ్ళిపోయేడు. ప్రమీల అతని వెనకాలే వెళ్ళి తలుపులు గడియపెట్టి మేడమీద కొచ్చింది. రాజు స్టూలుమీద వున్న "జ్యోతి" పత్రిక తిప్పుతున్నాడు. ప్రమీల వక్కపొడి తెచ్చి రాజుకు కొంచెం యిచ్చి తనూవేసుకుంది.

"మీరీమంచంమీద పడుకోండి. నేనాగదిలో పడుకుంటాను"

"థాంక్స్" అన్నాడురాజు పత్రికతిప్పుతూ, ప్రమీల ఏదో నవలతీసుకుని మంచంమీద పడుకుని చదువుతోంది.

* * *

రాజు టైం చూశేసరికి పదకొండుంపావు అయింది ప్రమీల పుస్తకం ప్రక్కకుపెట్టి "అమ్మా" అని మూలిగింది రాజు కలవరపడ్డాడు.

"ఏం! అలా మూలుగుతున్నారు"

"ఏదో నొప్పిగా ఉంది"

"ఎక్కడ" అంటూ రాజు ఆమె మంచందగ్గర చెళ్లేడు.

"గుండెల్లో దడగావుంది, తలనొప్పి"

రాజుకు షాక్ తగిలినట్లయింది.

'తలచూడండి నుదురుకాలుతోంది'

రాజు అనాలోచితంగానే అడుగుముందుకువేసి ప్రమీల నుదురుమీద చెయ్యిపెట్టి చూశాడు, మామూలుగానే వుంది, చెయ్యి తీసుకునేలోగానే ప్రమీల రెండు చేతులూ అతనిచేతికి అదిమిపట్టేయి. రాజు మెల్లగా మంచంమీద కూర్చున్నాడు. ప్రమీల చూపులు రాజును వశం చేసుకున్నాయి.

* * *

ఉదయం 9గ॥ లయింది. ప్రమీలకు టెలిగ్రాంవచ్చింది. బళ్ళారి ఆంధ్రుల సత్యాగ్రహంలో పాల్గొన్నందువల్ల వాసుదేవరావు అరెష్టయినాడట. ప్రమీల ఒక క్షణం విశ్చేష్టురాలై నిట్టూర్చి సోఫాలోకూలబడింది, హోస్పేటకు వేకువనే వెళ్ళిన రాజు 10॥లకు తిరిగి వచ్చేడు. ప్రమీల టెలిగ్రాంను అతని చేతికిచ్చింది, రాజు చకితుడై పోయేడు.

"బళ్ళారికెళ్ళి వాసు నెలాగైనా విడుదల చేయిస్తాను', ప్రమీల అంతవరకు దించిన తలను పైకెత్తింది. ఆమె ముఖంలో విచార చిహ్నలేమీ లేక పోవటంతో రాజు మరింత ఆశ్చర్య పడ్డాడు.

"మీయిష్టం వారివల్ల మీకేమైనా అపకారం జరగకుండా మాత్రం చూచుకోండి.

"చూస్తాను, ఎలాగైనా క్లిష్ట సమస్యే. నేశమైసూరు ప్రభుత్వ పోలీసు ఉద్యోగిని. ఈ ఆంధ్రోద్యమంపట్ల, ఆ ఉద్యమవ్యక్తులపట్ల ఆదరణచూపటం నా ఉద్యోగానికే ప్రమాదం. అయినా స్నేహితుని విషయంలో ఉపేక్షించటం......"

"రాత్రి సంఘటన అప్పుడే మరచిపోయేరు" రాజు ముఖం ఎర్ర బారింది. సిగ్గుతో తలవంచుకోక తప్పింది కాదు.

"కోపం వచ్చిందా? సరే. మీ యిష్టం. ప్రయత్నం చెయ్యండి"

రాజు హేట్ తగిలించుకుని నిలబడ్డాడు.

'నేను సాయంత్రానికి వస్తాను'

చరచరా వెళ్ళిపోయేడు. ప్రమీల ఒక్కసారి సూన్యాకాశంలోకి చూసి, ఆభవనానికి ఉత్తరంగా కొండమీద వున్న విఘ్నేశ్వరుని ఆలయం వైపు తిరిగింది.

* * *

రాజు బళ్ళారి వెళ్ళేసరికే. పరిస్థితి చెయ్యి జారి పోయింది. ప్రభుత్వనిషేధాజ్ఞలను ధిక్కరించి బహిరంగ సభలో ఉపన్యసించినందుకు వాసుదేవరావును 6 నెలలు ఖైదు శిక్షవిధించబడింది. రాజు వాసును కలుసుకున్నాడు.

"ఏమిటివాసూ! ఇదంతా!"

"ఏం చెయ్యను రాజూ! నీకోసమని నిన్నా ఇక్కడికి వచ్చేను, ఆంధ్ర సమితివారు ఏర్పాటుచేసిన బహిరంగ సభ జరుగుతోంది. నాలో ఉద్రేకం పుట్టింది, నన్ను నేవును సభాధ్యకునికి పరిచయం చేసుకుని మాట్లాడటాన్కి అనుమతించమన్నాను. వారు అంగీకరించేరు, నేను మాట్లాడుతున్నాను. 10ని॥లుకూడా కాలేదు. పోలీసులు మమ్మల్నిందర్నీ అరెష్టుచేసి తీసుకెళ్లేరు"

"బాగుంది. విశాఖపట్నంనుంచి హంపీశిధిలాలు చూడటాన్కి రావటమేమిటి. ఆనవసర వ్యవహారాల్లో జోక్యం కల్గించుకోవటమేమిటి?"

"ఏం చెయ్యని పరిస్థితులు అలాచేశాయి. అదిసరే నీవు ఇంద్ర భవనం నుంచేనా రావటం" రాజు సంకోచంతో తలదించుకుని ఔనన్నాడు. "నాకు తెలుసులే రాజూ' ప్రమీల చాలా బాధపడుతూ వుంటుంది. ఆమెను విశాఖపట్నం పంపించెయ్యి. ఎంత? ఆరు నెలలేగా',

"సరేలే వాసూ! రేపు ఆమెను ఇక్కడికి తీసుకొస్తాను. ఎక్కువసేపు మాట్లాడటం మంచిదికాదు; ఏమనకోకు వసాను" రాజు కాళ్ళీడ్చుకుంటూ బైటకు నడిచేడు. అతని మనస్సులో రైళ్లు పరుగెడుతున్నాయి. ఇటువంటి విశాల హృదయుడైన స్నేహితుని తాను తీరని అపచార చేశేడు, పాపం! పరిస్థితులు అలా చేశాయి. బాధతో, అవమానంతో, సిగ్గుతో క్రుంగి పోతున్నరాజు ప్రమీలను చూసేసరికి ఆశ్చర్యపోయేడు.

ప్రమీల ప్రోద్భలంవల్ల రాజు మూడునెలలు శెలవు పెట్టి, ప్రమీలతో సహా బెంగుళూరు రతన్‌కేఫ్‌లో విడిది చేశేడు, మూడు నెలలకాలంలోను, వాసును గురించి ప్రమీల ఒక్కసారికూడా మాట్లాడక పోవటంలో రాజు ప్రమీల భావాలను కొద్ది కొద్దిగా గ్రహించేడు. శెలవు పూర్తవుతోందనగా రాజును ఆంధ్రరాష్ట్రానికి తిరిగి బదిలీ చేస్తూ అతని స్వంతజిల్లా అయిన తూర్పుగోదావరిలోని కొత్తపేట స్టేషనుకువేశేరు, ప్రమీలతోసహా రాజు అక్కడకు చేరేడు.

* * *

మరొక మూడు నెలలు జరిగి పోయేయి. ఒక రోజు రాజుకు బళ్ళారిలోని ఒక స్నేహితునినుంచి ఉత్తరం వచ్చింది. అందులో వాసుదేవరావుకు జైలులో క్షయ వ్యాధి తగిలిందని, జైలు విడిచేసరికి అతని పరిస్థితి ఆందోళనకరంగా వుండటంతో మదనపల్లి శానిటోరియందు తీసుకొని పోబడ్డాడని వుంది. రాజు ఒక్కక్షణం అచేతనుడై పోయేడు. ప్రమీల ఆ సంగతివినికూడా ఓమీ మాట్లాడలేదు, రాజు ఆశ్చర్యంతో నిట్టూర్చి ఊరుకున్నాడు. కాలగమనంలో ప్రమీల ప్రణయ వీక్షణ బద్ధుడై రాజు కూడా వాసును మరచి పోయేడు. కాలగర్భంలో రెండును దీర్ఘ సంవత్సరాలు రెండు మధురక్షణాలుగా గడచి పోయేయి. రాజు ఆ ఉద్యోగరీత్యా అలవడిన దర్పంతో ప్రమీలమీదకూడా అధికారం చెలాయించటం ప్రారంభించేడు.

"నువ్వు చెప్పినట్లల్లా పడివుండటాన్కి నేను నీకట్టుకున్న భార్యనుకాను" అంది ప్రమీల ఒక రోజున. రాజుకు కోపం వచ్చేశింది. నోటికి వచ్చినట్లల్లా తిట్టేడు. ప్రమీల ధిక్కరించింది. తత్ఫలితంగా కట్టు గుడ్డలతో ప్రమీల ఆ ఊరు వదిలేసింది. 28సం॥ల వయసులో జీవితంలో ఎన్నో విషాద, మధుర సంఘటనలను చవిచూచిన ప్రమీల అతికష్టంమీద రాజమంద్రీ చేరుకుని చేతికివున్న

బంగారు గాజులు అమ్మి భవిష్య జీవితాన్నిగూర్చి ఆలోచించుకుంటూ కొద్ది మాసాలు మాత్రం నివసించిన కర్నూలు నగరం చేరుకుంది. తన బంధువులకుగాని. ఎరుగున్న వాళ్ళకుగాని కనపడకుండా వుండేటంత దూరం వచ్చేశింది.

* * *

శారీరిక వాంఛల్ని నిగ్రహించుకోలేని మనో దౌర్బల్యం గల ప్రమీల బుధవారపు పేటలోని ఒక బ్రోకరు చేతిలో పడింది. పద్దెనిమిది సంవత్సరాల పశిడి బొమ్మలాగ సడలిపోని యౌవనపు బిగువుగల ప్రమీల బ్రోకర్ రామయ్యకు నిధిలాగ దొరికింది. నవీన ఆకర్షణలుగల ఒక యింట్లో ప్రమీల ఒక భోగవస్తువుగా తయారయింది. ప్రమీల సౌందర్యం అనేకమంది ఉద్యోగుల్ని ఆకర్షించింది. తెలివిగల ప్రమీల బ్రోకర్ రామయ్యను తొలగించుకుని స్వతంత్రించి జీవిస్తోంది. ప్రభావతి అనే మారుతో ప్రమీల అనేకమంది ఉద్యోగుల కామదాహాన్ని తీరుస్తూ వేశ్యావృత్తిలో మరొక అంతస్థు పెంచుకుంది. ఒక సంవత్సర కాలంలోనే ఆమె సామాన్యులకు అందని మ్రాని పండయింది, సమీపంలోని ఒక పల్లెలోని భూస్వామియైన ఒక రెడ్డి ప్రస్తుతం ప్రభావతి వలలో చిక్కుకొన్నాడు. వారానికి కనీసం 3, 4 సార్లయినా వచ్చేవాడారెడ్డి. అడిగిన పైకాన్ని లేదనకుండా యిస్తున్న రెడ్డివల్ల ప్రభావతి చాలా నంపాదించింది,

♦ ♦ ♦

ప్రభావతి యింటి ప్రక్కనే వున్న ఒక గదిలో శెక్రటేరియట్‌లో పని చేస్తున్న రాంబాయి అనే యువకుడు కాపురం ఉన్నాడు. వయస్సు 22సం॥లకు మించకపోయినా మనిషి పొడగరి; దానికి తగిన శరీరసౌష్టవ వుంది. మంచి రూపసి. మూడు మాసాలనుంచి అప్పుడప్పుడు ప్రక్క ప్రక్కనేవున్న యిండ్ల కిటికీలగుండా ఆయిరువురి చూపులు కలుసుకునేవి, వయోబేధాన్ని ఎన్నడూ పాటించి ఎరుగని ప్రభావతి రాంబాబుతో స్నేహం చెయ్యటాన్కి, ఆతన్ని తన ప్రణయ దృక్కులతో బంధించటాన్కి వెనుదీయలేదు.

ఇంతలో ఒక విచిత్ర సంఘటన జరిగింది. ఒకనాటి సాయంత్రం ప్రభావతి ప్రియుడైన మునిరెడ్డి వచ్చేడు. ఆంధ్రాబ్యాంకి వాళ్ల ప్రచురించిన ఒక కరపత్రం ప్రభావతి కిచ్చేడు, ప్రభావతి కరపత్రాన్ని కొంచెం చదివి ఆశ్చర్యంతో ఒత క్షణం నిశ్చేష్టురాలై పోయింది, మునిరెడ్డి ప్రభావతి తాలకాన్ని చూసి కంగారు పడ్డాడు. ''ఏంలేదులే! ఈ కరపత్రంలోని యువతి నాకుతెలుసు'' అంటూ లోనికి వెళ్ళిపోయింది. కాని ఆక్షణం నుంచి ప్రభావతి మనసు మనసులో లేదు.

మరునాడుదయం రెడ్డి వెళ్ళిపోగానే ప్రభావతి కరపత్రం తీసుకుని చదువ నారంభించింది. ''మా బ్యాంకి ఖాతాదారైన శ్రీ మహీధరవాసుదేవగారు గత నెల మదనపల్లి శానిటోరియంలో చనిపోతూ వ్రాసిన వీలు నామా ప్రకారం వారి పేరిట మా బ్యాంకిలో నిల్వయున్న రు, 40,176-2-8లు వారితో పది సంవత్సరాల కాలం భార్యగా సహచర్యం నెరపిన ప్రమీలా దేవిగారికి సంక్రమిస్తుంది. ప్రమీలా దేవిగారు స్వయంగా హాజరై అక్కౌంటును తమపేర మార్చుకోవాలి. లేనియెడల వీలు నామాప్రకారం రెండు సంవత్సరాల అనంతరం తిరుపతి శ్రీ వెంకటేశ్వర స్వామి నిధికి అప్పగించ బడుతుంది - ఇట్లు ఆంధ్రాబ్యాంకి, విశాఖపట్నం బ్రాంచి''

ప్రభావతి తిరిగి ప్రమీలగామారి ఆలోచించ సాగింది, వాసు జైలులో వుండగాగాని, శానిటోరియంలో వుండగా కాని తాను అతన్ని చూడాలనైనా తలచలేదు. అయినా ఉదారంగా వాసు తనయావదాస్తిని తనకు చెందేటట్లు చేశేడు, వాసును ఉపేక్షించి రాజుతో వెళ్లిపోయి తద్వారా వాసుకు తీరని అపచారం చేసినా ఈనాడు వాసు ఉదారగుణ ఫలితంగా అతని ఆస్తికి వారసురాలు గాబోతోంది, ఆడబ్బును తీసుకోవటమా, మానటమా అనే ఆలోచనతో ప్రమీల ఉక్కిరి బిక్కిరవుతోంది. మచంచం మీల వెల్లకిలా పడుకుని ఆలోచిస్తున్న ఆమె మంచం మీదకు ప్రక్కయింటి కిటికీగుండా ఒక కాగితపువుండ వచ్చి పడింది. ప్రమీల ప్రభావతిగా మారి లేచికూర్చుంది. అంతవరకు ఆమె గమనించనేలేదు, ప్రక్కయింటి అబ్బాయి రెండు కిటికీల గుండా ప్రభావతి సౌందర్యాన్ని తిలకిస్తునే వున్నాడు.

(సశేషం)